
సాక్షి నంద్యాల

గురువారం। 2। ఫిబ్రవరి। 2023



లోక కల్యాణార్థం..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం నిర్వహించారు.



రగ్బీ ఫైనల్స్‌కు కర్నూలు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి రగ్బీ బాలుర పోటీల్లో ఫైనల్స్‌కు కర్నూలు, ప్రకాశం జిల్లా జట్లు చేరాయి. కర్నూలు ఆదర్శ విద్యా మందిర్ మైదానంలో గురువారం ఫైనల్ పోరు జరగనుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,616.16
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:51.220
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,888

న్యూస్‌రీల్

అన్నదానానికి విరాళాలు



విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న తిరుపతికి చెందిన కె.రాజగోపాల్ కుటుంబీకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం తిరుపతికి చెందిన కె.రాజగోపాల్ రూ.2,50,200, అలాగే మహారాష్ట్రకు చెందిన నారాయణరెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి చింతామణి

ఆళ్లగడ్డ: వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి చింతామణి అన్నారు. బుధవారం స్థానిక అనంత డిగ్రీ కళాశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై ఆయా సంక్షేమ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా చూడాలన్నారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు వచ్చేలా చదివించాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు, అనంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, యర్రగుంట్ల, ఆళ్లగడ్డ, చిన్నవంగలి, కోవెలకుంట్ల వసతి గృహాల సంక్షేమ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రాముడు, రామకోటిరెడ్డి, ఖాదర్‌బాషా, ఖాశీం సాహెబ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విధుల్లో సవాళ్లను అధిగమించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: పోలీస్ ఉద్యోగం రోజూ సవాళ్లతో కూడుకున్నదని, అన్నింటినీ అధిగమించాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో బుధవారం సాయుధ పోలీసు బలగాలకు మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పాటు తర్వాత మొట్టమొదటిసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని ఏఆర్ పోలీసులు రోజూ వ్యాయామం, యోగా చేసుకోవాలన్నారు. యోగా, ధ్యానం చేయడంతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. పోలీసులు తమతమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫైరింగ్, కవాతు, డ్రిల్, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలందించామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ సుంకరయ్య, దిశ డీఎస్పీ పోతురాజు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- రూ.4 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఆదోని రూరల్: లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి మల్లయ్యను అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం వల పన్ని పట్టుకున్నారు. చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన గురురాజారెడ్డి కొంతకాలంగా ములుగుందం గ్రామంలో నివాసముంటున్నాడు. సొంత గ్రామమైన చిన్నపెండేకల్‌లో పెద్దల ఆస్తి నుంచి మూడు సెంట్లు స్థలం వచ్చింది. స్థల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఓనర్‌షిప్ సర్టిఫికెట్ కావాలని చెప్పాడు. ఈ సర్టిఫికెట్ కోసం పంచాయతీ కార్యదర్శి మల్లయ్యను ఆశ్రయించగా రూ.7 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రూ.4 వేలకు బేరం కుదుర్చుకుని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తన ప్రధాన అనుచరుడు షఫీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి మల్లయ్య బుధవారం రూ.4 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. మల్లయ్యను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.

పల్లె ప్రజలకు ఎంతో ప్రయోజనం



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. ఇది వరకు డాక్టర్ వద్దకు రోగులు వచ్చే వారు. ఇప్పు డు రోగుల వద్దకే వైద్యబృందం వెళ్లి వైద్య సేవలు అందించడం మంచి పరిణామం. దాదాపు 80 శాతానికి పైగా వ్యాధులకు ఇంటి వద్దే వైద్యం అందుతోంది. ఫ్యామిలీ డాక్టర్ పరిధిలో లేని వ్యాధులకు మాత్రమే జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

సాధారణ వ్యాధులన్నింటికీ చికిత్స



జిల్లాలోని ప్రతి మండలానికి ఒకటి చొప్పున 104 వాహనం ఉంది. ఈ వాహనంతో పాటు వైద్యులు సైతం గ్రామానికి వెళ్లి ఫ్యామిలీ డాక్టర్‌గా చికిత్స చేస్తున్నారు. ఇది గ్రామాల్లోని పేదలకు, పట్టణాలకు రాలేని వారికి ఎంతో మేలు చేకూరుస్తుంది. సాధారణ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులకు ఇక్కడే చికిత్స లభిస్తుంది. దీనివల్ల వారికి వ్యయప్రయాసలు తగ్గుతాయి.

– చంద్రమౌళి, అరబిందోఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్, జోనల్ మేనేజర్, కర్నూలు

మాలాంటి వారికి ఎంతో ఉపయోగం



నేను కొంత కాలంగా అధిక రక్తపోటుతో బాధపడుతున్నాను. ప్రతి నెలా ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకునే స్థోమత లేదు. ప్రతి నెలా మా గ్రామానికి 104 వాహనంలో వైద్య సిబ్బందితో పాటు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతున్నాను.

– ఉగాది నారమ్మ, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నాకు 51 సంవత్సరాల వయస్సు. షుగర్ వ్యాధి ఉంది. ప్రతి నెలా మా గ్రామానికి డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు 104 వాహనంలో వచ్చి షుగర్ పరీక్ష చేసి మందులు ఇచ్చి, షుగర్ పెరగకుండా జాగ్రత్తలు చెబుతున్నారు. ఇలాంటి సేవలు మా గ్రామానికి అందిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బందికి మా కృతజ్ఞతలు. ఈ పథకం ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌కి ఎంతో రుణపడి ఉంటాం.

– వడ్డే లక్ష్మీదేవి, ఎర్రకత్వ గ్రామం, కల్లూరు మండలం

నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



రాష్ట్రప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా అక్టోబర్ 21వ తేదీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ట్రయల్ రన్ ప్రారంభించాం. ఈకార్యక్రమం ద్వారా పేద ప్రజలకు ఉచిత చికిత్స, మందులను అందించాం. మార్చి 1 నుంచి ముఖ్యమంత్రి చేతులమీదుగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుంది.

– డాక్టర్ జగదీశ్వరరెడ్డి , నంద్యాల జిల్లా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్

ఇంటికొచ్చి.. స్వస్థత చేకూర్చి!

ఇన్నాళ్లు సంపన్నులకే పరిమితమైన 'ఫ్యామిలీ డాక్టర్' ఇప్పుడు పేదలకూ చేరువవుతున్నారు. ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తున్నారు. జబ్బు ఏదైనా మేమున్నామని కుటుంబానికి భరోసా ఇస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా పల్లె జనానికి మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీకారం చుట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు





ఇంటి వద్దే చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు

- ఉమ్మడి జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్‌రన్ పూర్తి
- మూడు నెలల్లో 2,11,127 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- మార్చి 1 నుంచి పల్లెలకు ఫ్యామిలీ డాక్టర్ల సేవలు
- వాహనం వద్దకు రాలేని వారి ఇంటికెళ్లి వైద్యుల చికిత్స
- 15 రోజులకు సరిపడా మందుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్)/బొమ్మలసత్రం: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే ఉన్న కుటుంబ వైద్యుల విధానాన్ని ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 54 మండలాలు, వెయ్యికి పైగా సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుత ఆరోగ్య విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరేసి వైద్యులు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. గతంలో ఒక్కోపీహెచ్‌సీలో ఒకరు లేదా ఇద్దరు, కొన్ని పీహెచ్‌సీల్లో నాలుగు నుంచి ఆరు మంది వరకు డాక్టర్లుండేవారు. ఇప్పుడా విధానాన్ని మార్పు చేసి ప్రతి పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఒకరు పీహెచ్‌సీలో ఉండి ఓపీ సేవలు అందిస్తుండగా, మరొకరు క్షేత్రస్థాయికి వెళ్లి గ్రామాల్లో రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించనున్నారు. వీరికి జిల్లాలోని సచివాలయాల్లో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, స్థానిక ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు సహకారం అందించనున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌గా ఇంటి వద్దకే వైద్యసేవలు

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పీహెచ్‌సీల్లో ఉండే వైద్యులు రోగుల ఇంటి వద్దకే వెళ్తున్నారు. ఈ మేరకు వారు 104 వాహనంలో కేటాయించిన గ్రామానికి నెలకు ఒకసారి వెళ్తారు. వాహనంలోనే రోగులకు అవసరమైన బీపీ, షుగర్, గుండెజబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధులకు చికిత్స, వివిధ వ్యాధులకు 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, 67 రకాల మందులు అందజేస్తారు. వాహనం వద్దకు రాలేని రోగులను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఇంటి వద్దకే వెళ్లి వైద్య సిబ్బంది వెళ్తున్నారు. ఈ మేరకు ప్రతి రోగిని పేరుపేరునా పలకరించి వారి బాగోగులు తెలుసుకుని అవసరమైన మందులు ఇచ్చి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపుతున్నారు. సాధారణ రోగులతో పాటు ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారి బాగోగులనూ కనుగొని వైద్యం చేస్తున్నారు. వీరి పరిధిలోకి రాని వైద్యసేవలను టెలీమెడిసిన్ ద్వారా జిల్లా కేంద్రంలో ఉన్న వైద్యులతో మాట్లాడి సేవలందిస్తున్నారు. దీంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఓపీ సేవలు అందిస్తున్నారు.

మూడు నెలల్లో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ ముఖ్య సేవల సంఖ్య (జిల్లాల వారీగా..)

సేవలు అందుకున్న వారు	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
గర్భిణులు	16,888	6,607
బాలింతలు	13,820	5,434
రక్తహీనత బాధితులు	1,884	426
రక్తపోటు బాధితులు	36,429	15,294
మధుమేహ రోగులు	24,747	10,759
క్యాన్సర్ బాధితులు	1,000	463
క్షయ పీడితులు	737	662

అన్ని రకాల వైద్య సేవలు

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌పై గత సంవత్సరం అక్టోబర్ 21వ తేదీ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ట్రయల్ రన్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 1,03,650 మందికి, నంద్యాల జిల్లాలో 1,07,477 మందికి అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించారు. వారికి కావాల్సిన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలతోపాటు రక్తహీనత, బీపీ, షుగర్, క్షయ, నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు చికిత్సలు అందుకున్న వారిలో ఉన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. తీవ్రమైన, సాధారణ ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందాయి. నవజాత శిశువులకు, చిన్నారులకు, కౌమారదశ బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సంక్రమిత(అంటువ్యాధులు), అసంక్రమిత వ్యాధుల నివారణ చర్యలు తీసుకున్నారు. సాధారణ కంటి, చెవి, ముక్కు, గొంతు, నోటి పరీక్షలు నిర్వహించారు. మానసిక ఆరోగ్య, డి అడిక్షన్ సేవలు అందించారు.

మెడికల్ కళాశాలకు తొలగిన అడ్డంకులు



చురుగ్గా సాగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

- మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వేసిన మూడు పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు
- రూ.60 కోట్లతో శరవేగంగా జరుగుతున్న పనులు
- 2013-14 నుంచే మొదటి సంవత్సరం అడ్మిషన్లు
- మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లు

నంద్యాల: నూతన జిల్లాగా ఏర్పాటైన నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. టీడీపీ నాయకులు వేసిన మూడు పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తులు ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సోమయాజులు బుధవారం కొట్టివేశారు. దీంతో నంద్యాల మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయి, వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు మొదలు కానున్నాయి. నంద్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాటను నిలబెట్టుకుంటూ మెడికల్ కళాశాల, 300 పడకల ఆసుపత్రి, దీనికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇచ్చారు. మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం 50 ఎకరాల భూమి, రూ.450 కోట్లు నిధులు మంజూరు చేశారు. పట్టణంలోని నూనెపల్లె ఏరియాలో మెడికల్ కళాశాల నిర్మాణానికి భూములు కేటాయించారు. అదే విధంగా నూనెపల్లెలో ఉన్న ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన 50 ఎకరాల భూమిని మెడికల్ కళాశాల నిర్మాణానికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అభివృద్ధిని అడ్డుకోవడానికి టీడీపీ నాయకులు ఇతర వ్యక్తులతో ఆర్ఏఆర్ఎస్ భూముల్లో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టవద్దని, అక్కడ తాత్కాలిక కలెక్టర్ కార్యాలయం ఉంచరాదని హైకోర్టులో మూడు పిటిషన్లు వేయించారు. వీటిని విచారించిన హైకోర్టు.. ఆ మూడు పిటిషన్లు కొట్టివేసింది. దీంతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి మార్గం మరింత సుగమం అయ్యింది.

వచ్చే విద్యాసంవత్సరం నుంచే..

2023-24 విద్యాసంవత్సరంలో మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. వీటి కోసం రూ.60 కోట్లతో ఈ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలోపు బిల్డింగ్‌ను పూర్తి చేసి అడ్మిషన్లు ప్రారంభించేందుకు అధికారులు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. రూ.32కోట్లతో మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమయ్యే కాలేజీ భవన నిర్మాణాలు రూ.12కోట్లతో బాయ్స్, గర్ల్స్ హాస్టళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం నుండి 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశం కలగనుంది.


అభివృద్ధిని అడ్డుకోవద్దు



నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచి పోతారని ఓర్వలేక టీడీపీ నాయకులు ఇతర వ్యక్తులతో కోర్టులో పిటిషన్లు వేయించారు. ఒక మెడికల్ కళాశాలే కాదు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నా ఏ అభివృద్ధి పని చేయాలన్నా కోర్టుకు వెళ్లి ఆపుతున్నారు. కోర్టు తీర్పును గౌరవించి ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించాలి.

– శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

మే నెలాఖరుకు పనులు పూర్తి



మెడికల్ కళాశాల నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. 2023-24 విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం కావాలని అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమయ్యే భవన నిర్మాణాలు వేగంగా చేయిస్తున్నాం. మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తాం.

– స్వర్ణలత, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్, నంద్యాల



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో సువార్తమ్మకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ సుబ్బలక్ష్మి



నంద్యాలలో చికిత్స పొందుతున్న వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి చెందిన ముగ్గు సామన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వామి నాయక్

వేకువనే పింఛన్ పిలుపు!

- నంద్యాల జిల్లాలో 90 శాతం, కర్నూలు జిల్లాలో 80.67 శాతం పంపిణీ



కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డోన్ మండలం కన్నపకుంట గ్రామానికి చెందిన నారాయణరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భూలక్ష్మి

నంద్యాల రూరల్/కర్నూలు(అగ్రికల్చర్): తెల్లవారుతుండగానే వలంటీర్లు పింఛన్ పిలుపుతో లబ్ధిదారుల ఇంటి ముందు వాలిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం నుంచే పండుగ వాతావరణంలో కొనసాగింది. మొదటి రోజునే అత్యధిక శాతం పింఛన్ పంపిణీ చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయం 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్ నగదును అందజేశారు. పొలాల్లో పనిచేస్తున్న లబ్ధిదారులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి మరీ అందజేయడం విశేషం. నంద్యాల జిల్లాలో 2,17,785 పింఛన్లు ఉండగా... 1,96,006 (90 శాతం) పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో 2,39,934 ఫించన్‌లు ఉండగా.. 1,93,545 (80.67 శాతం) పంపిణీ చేశారు.



కొలిమిగుండ్ల మండలం రాఘవరాజుపల్లెలో దివ్యాంగుడు రమణారెడ్డికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రామ్మోహన్‌రెడ్డి

చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాల పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఈ క్రాప్ బుకింగ్, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై రైతులకు అవగాహన తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటల ఉత్పత్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలందరూ పోషకాలు ఉన్న చిరుధాన్యాల ఆహార పదార్థాలపై మక్కువ చూపుతున్నారని, ఈ మేరకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రబీ పంట కాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 9 శాతం ఈ క్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పెండింగ్‌లో ఉన్న 27,024 మంది రైతుల ఈ కేవైసీని వెంటనే పూర్తి చేయాలన్నారు. రసాయనిక ఎరువులు, విత్తనాలు పక్కదారి పట్టకుండా ఎరువుల దుకాణాలపై విస్తృత దాడులు నిర్వహించి నియంత్రించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, డీఎస్‌ట ఆచార్యులు, నంద్యాల ఏడీఏ రాజశేఖర్, డోన్ ఏడీఏ అశోకవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్

కర్నూలు(హాస్పిటల్): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంహెచ్‌డబ్ల్యు) ట్రైనింగ్ ప్రిన్సిపాల్ విజయ సుశీలకు బుధవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్) ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య షోకాజ్ నోటీస్ అందజేశారు. హాస్టల్ విద్యార్థినులను ఆమె వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలు రావడంతో వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. ట్రైనింగ్ ప్రిన్సిపాల్ వేధింపులు భరించలేక విద్యార్థులు మొత్తం హాస్టల్ ఖాళీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య శిక్షణ కేంద్రానికి వెళ్లి వివరాలు ఆరా తీశారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థి శివ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి ఇటీవల జరిగిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తాయోనని మనస్తాపం చెందాడు. దీంతో బుధవారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబీకులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఏప్రిల్ 3 నుంచి సార్వత్రిక విద్యా పీఠం పరీక్షలు

కర్నూలు కల్చరల్: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల ఫీజును ఈ నెల 15వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి ఫీజు ఒక్క సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ థియరీ ఒక్క సబ్జెక్టుకు రూ. 250, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ ఒక్క సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ ఇంప్రూమెంట్‌కు థియరీకి ఒక్క సబ్జెక్టుకు రూ. 300, ప్రాక్టికల్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

మహిళ బలవన్మరణం

కోవెలకుంట్ల: సంజామల మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన ఏరాసి పద్మావతమ్మ(51) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. ఐదు నెలల నుంచి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో గత నెల 27వ తేదీన ఈమె పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు రూరల్: చిల్లబండ నాలుగు రోడ్ల కూడలిలో అక్రమంగా ఆటోలో గోరంట్ల గ్రామానికి తరలిస్తున్న రూ. 1.25 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ శ్యాంప్రసాద్ బుధవారం తెలిపారు. మద్యం తరలిస్తున్న కర్నూలుకు చెందిన ఉప్పరి లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అలాగే మద్యం సరఫరా చేస్తున్న కర్నూలుకు చెందిన ఉప్పరి వెంకటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

బాధితుల్లో మహిళలే అధికం



పురుషుల కంటే మహిళల్లో ఈ వ్యాధి కాస్త ఎక్కువ. ముందుగా వ్యాధిని గుర్తించి సరైన సమయానికి వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. మందులు సరిగ్గా వాడకపోతే ఇతర అవయవాలకు నష్టం కలిగే అవకాశం ఉంది. ఏదైనా ఆహారం తింటే అది పడకపోతే దానిని మానేయాలి. మందులతో పాటు మంచి ఆరోగ్య జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. బరువును నియంత్రించుకోవాలి.

–డాక్టర్ సృజన, రుమటాలజిస్టు, కర్నూలు

హోమియోలో ఫలవంతమైన చికిత్స



రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు సకాలంలో వైద్యం అందించకపోతే ఎముకలపై ఉండే మృదులాస్తికి నష్టం కలిగిస్తుంది. దీనికి హోమియోపతిలో ప్రభావవంతమైన, ఫలవంతమైన చికిత్సలున్నాయి. ఈ వ్యాధికి కొల్చికం, డల్కమరా, యూపటోరియం, ఫెర్రంఫాస్, ఫార్మిక రూఫా, గ్వాయకం, లేడంపాల్, లిథియం కార్బ్, మెరోక్సల్, పల్సాటిల్లా, రూస్టాక్స్, స్టెల్లేరియా లాంటి ప్రభావంతమైన మందులున్నాయి.

–డాక్టర్ విద్యాసాగరరావు, ఆయుష్ హోమియో మెడికల్ ఆఫీసర్, కర్నూలు

ఆయుర్వేదంలో మెరుగైన చికిత్స



జంక్‌ఫుడ్, మసాలా ఫుడ్, ఆల్కహాలు తీసుకోవడం వల్ల శరీరంలో వాతం ప్రకోపిస్తుంది. వేళకు నిద్రపోకపోవడం, రాత్రిపూట జాగరణ చేయడం, ఉదయం ఆలస్యంగా లేవడం వల్ల కూడా శరీరంలో వాతం అధికమవుతుంది. కీళ్ల వాతానికి ఆయుర్వేదంలో మంచి మందులున్నాయి. సింహనాదగుగ్గుల్లు, ఆమవాతాది గుగ్గుల్లు, ఆమవాతాది కషాయం. మహారాస్నాది కాడ, మిరియాలు, శొంఠిపొడి, వేడికాపడం వంటివి ఈ వ్యాధిని తగ్గించడంలో తోడ్పడతాయి.

–డాక్టర్ ఐవి. సుబ్రహ్మణ్యేశ్వరకుమార్, ఆయుర్వేద వైద్యులు, నంద్యాల

వామ్మో..నొప్పి!

- నడి వయసులో పట్టేస్తున్న కీళ్లు
- వేధిస్తున్న రుమటాయిడ్ సమస్యలు
- జీవన విధానంలో మార్పులు తప్పనిసరి
- నేడు రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా నడివయస్సు వారికి కీళ్లనొప్పులు అధికంగా వస్తున్నాయి. బాధితులు కూర్చోలేరు, నాలుగడుగులు వేయలేరు...సొంతంగా లేవలేరు... పడుకోవడమూ కష్టమే. పలు జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 2వ తేదీన(గురువారం) రుమటాయిడ్ ఆర్థరైటిస్(కీళ్లవాతం) అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

నివారణ మార్గాలు

- మసాల ఆహారానికి, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం
- మాంసాహారం, నిల్వ ఉంచిన పదార్థాలు తినకపోవడం
- మినుములతో చేసిన పదార్థాలు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండటం
- చల్లని వాతావరణంలో జాగ్రత్తలు తీసుకోవడం
- రాత్రిపూట నిద్ర మేల్కోకుండా ఉండటం

జనాభాలో ఐదు శాతం మంది బాధితులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రుమటాయిడ్ ఆర్థరైటిస్(కీళ్లవాతం) వ్యాధిగ్రస్తుల సంఖ్య ఇటీవల బాగా పెరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా జనాభాలో ఐదు శాతం మందికి పైగా అంటే దాదాపు 2,40,000 మందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. మొదట్లో దీని బారిన పడే వారు అధికంగా పట్టణాల్లో మాత్రమే ఉండేవారు. ఇప్పుడు పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఈ వ్యాధి పీడిస్తోంది.

కారణాలు ఇవే..

జీర్ణం కాకముందే ఆహారాన్ని మళ్లీ మళ్లీ తీసుకోవడం, సమయానికి ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం వల్ల అది విషం(ఆమం)గా మారి శరీరంలో ప్రసరించి వాతాన్ని కలిగిస్తుంది. అది ప్రకోపించి అన్ని కీళ్లలో చేరి అక్కడ నొప్పి, వాపును కలుగజేస్తుంది. ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌గా దీన్ని పిలుస్తారు. అంటే మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ మనపై వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. మన శరీరంలోని రక్షణ వ్యవస్థ మనలను రక్షించడానికి బదులు శరీరంలోని కణజాలాలు, కీళ్లపై దాడి చేసి అక్కడ నొప్పి, వాపును కలుగజేస్తాయి. అంటువ్యాధులు, హార్మోన్ల మార్పులు, మానసిక ఒత్తిళ్లు, ధూమపానం, కాలుష్యకారకాల వల్ల కూడా కీళ్లవాతం వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ సమస్యను ఆధునిక పరిభాషలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారు.

లక్షణాలు ఇవీ..

ఉదయం పూట కీళ్లు బిగుతుగా ఉంటాయి. వాటిని కదిలించేందుకు ఇబ్బందిగా, విపరీతంగా నొప్పులు ఉంటాయి. చర్మంపై దద్దుర్లు, అలసట, రక్తహీనత, కళ్లు, నోరు పొడిబారడం, మోచేతులు, చేతులు, మోకాలు, ఇతర కీళ్లలో గట్టిగా గడ్డలు లాంటివి ఉంటాయి. తేళ్లు కుట్టినట్లు అన్ని కీళ్లలో నొప్పులు, వాపు రావడం. రుచి తెలియకుండా ఉండటం, దాహం అధికంగా వేయడం, ఏ పనీ చేయాలని అనిపించకపోవడం, ఒళ్లంతా బరువుగా ఉండటం, జ్వరంగా ఉండటం, వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వాల్మీకుల ఐక్యతతోనే హక్కుల సాధన



డైరీని ఆవిష్కరిస్తున్న వాల్మీకి నేతలు

- 2023 డైరీని ఆవిష్కరించిన నేతలు

కర్నూలు(అర్బన్): ఐకమత్యంగా ఉంటే వాల్మీకులు తమ హక్కులను సాధించుకోవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ జీ భవానీ ప్రసాద్, డాక్టర్ కే రామచంద్రనాయుడు,హోంగార్డ్స్ ఎస్పీ ఎం మహేష్ అన్నారు. బుధవారం స్థానిక కృష్ణకాంత్ ప్లాజాలోని కార్యాలయంలో వాల్మీకి బోయ సేవా సంస్థ 2023 నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షులు తలారి క్రిష్ణనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి పునరుద్ధరించేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించిన గత నెల చివరల్లో శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ ఏకసభ్య కమిషన్ కూడా వివిధ ప్రాంతాలు పర్యటించి వాల్మీకుల ఆచార వ్యవహారాలు, స్థితిగతులను స్వయంగా చూసిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో భవిష్యత్తులో వాల్మీకులకు మంచి జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు కుబేరస్వామి, సహాయ కార్మిక శాఖ కమిషనర్ సాంబశివ, దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరామయ్య, వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ బేతం క్రిష్ణుడు, వాల్మీకి యోగా కేంద్ర నిర్వాహకురాలు బీటీ జయలక్ష్మి, చంద్రయ్య, వీరవసంత్, బొగ్గుల ఈరన్న, సత్రం రామక్రిష్ణుడు, మార్కాపురం రామాంజనేయులు, కేఎంసీ మేనేజర్ చిన్న రాముడు, డా.మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారుల విచారణ

పగిడ్యాల: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని విజయవాడ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి.ఎం. గౌడ్‌పై 2019లో నమోదైన కేసులో భాగంగా బుధవారం తిరుపతి ఏసీబీ సీఐ తమీమ్ అహ్మద్ పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వి.ఎం. గౌడ్‌కు సంకిరేణిపల్లె, బీరవోలు గ్రామాల మధ్య పొలాలు ఉన్నాయని వాటి నుంచి ఏటా ఆదాయం వస్తోందని చూపించడంతో ఏసీబీ అధికారులు విచారణ చేశారు. సర్వే నం. 41, 42/ఏ నమోదైన 1.11 సెంట్ల భూమిలో ఏఏ పంటలు సాగు చేస్తారు, ఎంత ఆదాయం వస్తుందనే తదితర వివరాలు చుట్టు పక్కల రైతులను విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విచారణలో తహసీల్దార్ భారతి, వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్, ఉద్యానవన శాఖ అధికారి దివ్య, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ, వీఆర్వో, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్స్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి దుర్మరణం

- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ట్రాలీ ఆటో
- తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి
- పరిస్థితి విషమం



ప్రమాదంలో గాయపడిన మధు



ప్రమాదంలో మృతి చెందిన జయకృష్ణ(ఫైల్)



ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ట్రాలీ ఆటో

డోన్ రూరల్: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై డోన్ పట్టణంలోని స్థానిక కూరగాయల మార్కెట్‌యార్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని స్థానిక పాతపేటకు చెందిన సుంకులమ్మ కుమారుడు జయకృష్ణ (15) కృష్ణగిరి మండలంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా పట్టణానికి చెందిన మధు అనే వ్యక్తి స్థానిక టోల్ ప్లాజా సమీపంలోని రెస్టారెంట్ వద్ద దిగేందుకు ఎక్కాడు. ఇద్దరూ బైక్‌పై వెళ్తుండగా గుత్తి నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మధు పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బేతంచెర్ల మండలం లక్ష్మంపల్లికి చెందిన సుంకులమ్మ భర్త మహేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ రెండేళ్ల క్రితం మరణించాడు. ఆ తర్వాత ఆమె కుమారుడు, కుమార్తెతో డోన్‌కు చేరుకుని జీవిస్తోంది. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రీ-మార్ట్‌ల ద్వారా పరిశుభ్ర మాంసం

- పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీరాములు



జ్యోతి ప్రజ్వలనతో అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న శ్రీరాములు

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మాంసం సరఫరా చేసేందుకు ప్రీ-మార్ట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మాంసం అభివృద్ధి సంస్థ (ఏపీ మీట్ కార్పొరేషన్) చైర్మన్ ఎం.శ్రీరాములు తెలిపారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం కర్నూలు కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మాంసం వ్యాపారులు, వినియోగదారులకు ప్రీ-మార్ట్ మాంసం ఉత్పత్తి కేంద్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మీట్ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు నాణ్యమైన మాంసం ఉత్పత్తి చేసి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. వ్యాపారులు ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ప్రీ-మార్ట్ పరికరాల యూనిట్ కాస్ట్ రూ.15.34 లక్షలు కాగా అందులో 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఆధునిక జంతువధశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మీట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ విజయుడు మాట్లాడుతూ... తొలుత కర్నూలు,నంద్యాల జిల్లాల్లో ప్రీ- మార్ట్ మాంసం ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి ఆ తర్వాత మిగతా ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య, ప్యాపిలి గొర్రెల పెంపకందారుల ట్రైనింగ్ సెంటర్ డీడీ శాంతయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



గోరుకల్లు జలాశయం వద్ద ఇన్‌టెల్ నిర్మాణాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించేందుకు రూ.238 కోట్లతో చేపడుతున్న వాటర్ గ్రిడ్ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గోరుకల్లు జలాశయం వద్ద పైపులైన్‌కు సంబంధించి ఇన్‌టెల్ కాంక్రీట్ పనులను పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో చర్చించారు. ఇప్పటి వరకు రూ. 78 కోట్లతో 38 శాతం పనులు పూర్తి చేశామని, ఏప్రిల్‌లోగా బేతంచెర్లకు నీరు ఇచ్చేందుకు పనులు పూర్తి చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట ఎస్‌ఈ మనోహర్, ఈఈలు సోమశేఖర్, మధుసూదన్, బాలకృష్ణ, మనోజ్, మధుశేఖర్, ఆచారి, ఎల్లరాజు, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి పాల్గొన్నారు.

సాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

గోరుకల్లు జలాశయ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఎస్సార్బీసీ పరిధిలో ఉన్న పాణ్యం జాతీయ రహదారి నుంచి గోరుకల్లు వరకు 9 కిలోమీటర్ల రోడ్డును ఆర్‌అండ్‌బీలోకి మార్చి మరమ్మతులు చేయించాలన్నారు.

గుట్కా ప్యాకెట్ల దహనం



వెలుగోడు: సుమారు రూ. 20 లక్షల రూపాయల విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను బుధవారం వెలుగోడు పోలీసులు తగులబెట్టారు. ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల పట్టణంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో భారీగా స్వాధీనం చేసుకున్న గుట్కాను స్టేషన్‌కు తరలించారు. కాగా గుట్కా ప్యాకెట్లు వల్ల సిబ్బంది విధులకు ఆటంకం కలుగుతుండడంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు సమక్షంలో గుట్కా ప్యాకెట్లను తగులబెట్టినట్లు ఎస్‌ఐ వివరించారు.

కేంద్ర నిధుల వినియోగంపై అధ్యయనం

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో మరింత పారదర్శకత ఉండే విధంగా అధ్యయనం చేస్తున్నట్లు నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, సంతోష్‌కుమార్ తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎన్‌ఎల్‌ఎం టీమ్ సభ్యులు బుధవారం డీఆర్‌డీఏ- వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 8వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి కేంద్రప్రభుత్వ నిధుల వినియోగంపై పరిశీలన చేస్తామన్నారు. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, నందవరం మండలాల్లోని 6 పంచాయతీలు, నంద్యాల జిల్లాలోని ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల మండలాల్లోని 4 పంచాయతీలను సందర్శించనున్నట్లు చెప్పారు. ఎన్‌ఎల్‌ఎం టీమ్ పర్యటించే 10 పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలపై నివేదికను వారికి జిల్లా అధికారులు అందజేశారు. అనంతరం కృష్ణగిరి మండలం పోతుగల్ గ్రామంలో పర్యటించి కేంద్ర నిధుల వినియోగంపై వారు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ అమరనాథరెడ్డి, జెడ్పీ సీఈవో నాసరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డ్వామా అదనపు పీడీ సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్, డీఆర్‌డీఏ–వైకేపీ ఏపీడీ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం(రూ)	గరిష్టం (రూ)
వేరుశెనగ	4912	8611
ఆముదం	6109	6529
వాము	2000	23006
ఉల్లి	425	1059
ఎండు మిర్చి	8259	27786
శనగలు	4369	4619
కందులు	2920	7249
మినుములు	6689	6689

బాధితులకు న్యాయం చేయండి

- నేర సమీక్షలో క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ ఆదేశం



నేర సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం ద్వారా బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బుధవారం డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించి ఎస్పీ పోలీసు అధికారులతో మాట్లాడారు. నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షలు పడే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యేంత వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్ష్యుల విచారణ, వాంగ్మూలం, కోర్టుకు సమర్పించడంలో పోలీసు అధికారులు పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి కేసులో కచ్చితమైన దర్యాప్తు ఉండాలని గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో సాక్ష్యులను మోటివేట్ చేయాలన్నారు. సంచలన కేసుల్లో త్వరగా పరిశోధన పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామ సందర్శనలు, పల్లె నిద్రలు, ఫ్యాక్షన్ , లా అండ్ ఆర్డర్, ఇతర సమస్యలు నివారించడానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి, గుర్తించబడిన గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు పురోగతి గురించి ఆరా తీశారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న యూఐ కేసులు, గ్రేవ్ కేసుల గురించి ఎస్పీ సుదీర్ఘంగా సమీక్షించారు. విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేయడం ద్వారా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకటాద్రి, వెంకటరామయ్య, యుగంధర్ బాబు, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, కేవీ మహేష్‌తో పాటు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.